క్లుప్తంగా

ఆలయంలో విశేష పూజలు


ఆలయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు

కొయ్యలగూడెం : శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ మదన గోపాల స్వామి ఆలయ ప్రారంభోత్సవ పూజలు సోమవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. నూతనంగా నిర్మించిన ఆలయ ప్రాంగణంలో వైఖానస ఆగమ పండితులు సహస్రాధిక విగ్రహ ప్రతిష్టాపన ఆచార్య శ్రీమాన్ శ్రీనివాసుల శేషాచార్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. పలువురు దంపతులు ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మంగళవారం సాయంత్రం నుంచి స్వామివార్ల గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం


దాతకు విరాళం బాండ్ పత్రం అందజేత

ద్వారకాతిరుమల : శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు మైలవరంకు చెందిన సిరిపురపు కండాల రూపశ్రీ సోమవారం రూ. 51,116 విరాళంగా అందజేశారు. ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేయగా, దాత కుటుంబానికి ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

అలరించిన గరగ నృత్యాలు


గరగనృత్యాలు చేస్తున్న కళాకారులు

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి) : జీలుగుమిల్లిలో జగదాంబ అమ్మవారి జాతర మహోత్సవాలు రెండో రోజూ ఘనంగా సాగాయి. అమ్మవారికి ఉదయం, సాయంత్రం సహస్ర నామార్చన, కుంకుమ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో నిర్వహించిన గరగ నృత్యాలు అలరించాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ చాట్రాతి భవానీశేఖర్ తెలిపారు.

ఆక్సిజన్ ఫ్లో మీటర్ల అందజేత


ఆక్సిజన్ ఫ్లో మీటర్లు అందజేస్తున్న దాతలు

కామవరపుకోట : గత కరోనాకాలం నుంచి కామవరపుకోట పరిసర ప్రాంత ప్రజలకు ఆక్సిజన్ సిలిండర్లు అందజేస్తున్న మండలంలోని యాంటీ కరోనా టీం వారికి సోమవారం దాతలు రెండు ఆక్సిజన్ ఫ్లో మీటర్స్ అందజేశారు. రామన్నపాలెం గ్రామానికి చెందిన మోహన్ రావు, విజయలక్ష్మి దంపతులు తమ కుమారుడు స్వర్గీయ సాయి పుట్టినరోజు సందర్భంగా అతని జ్ఞాపకార్థం రూ.7 వేల విలువగల రెండు ఆక్సిజన్ ఫ్లో మీటర్లను యాంటీ కరోనా టీం సభ్యులు వీరమల్ల మధుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో షణ్ముఖ రాజా, అనూష, యాంటీ కరోనా టీం సభ్యులు నిజాపరపు దుర్గాప్రసాద్, సొజన్ సాయి పాల్గొన్నారు.

బహిరంగ సభకు తరలిరండి

బుట్టాయగూడెం : గిరిజన సమస్యలపై మార్చి 27వ తేదీన గిరిజన బహిరంగ సభను ఏర్పాటు చేసినట్లు గిరిజన సంఘ జిల్లా కమిటీ సభ్యులు కొవ్వాసి దుర్గారావు, జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ తెలిపారు. బహిరంగ సభకు సంబంధించిన గోడ పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీలుగుమిల్లి మండలంలో కేంద్ర ప్రభుత్వం తుపాకుల కర్మాగారం ఫ్యాక్టరీ నిర్మాణానికి సర్వేలు నిర్వహిస్తున్నారని ఇది గిరిజన చట్టాలకు విరుద్ధమని అన్నారు. బహిరంగ సభలో గిరిజనులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అనాలోచిత నిర్ణయాలు తగవు


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: సమస్యలకు పరిష్కారం వెతకాలే గాని, అనాలోచిత నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదని ప్రిన్సిపాల్ ఎన్. ప్రసాద్‌బాబు హితవు పలికారు. స్థానిక సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో జరిగిన ఘటనలు బాధాకరమన్నారు. మెడికల్ విద్యార్థిని ప్రీతి ఆత్మహత్య, ఒక విద్యార్థి మరొక విద్యార్థిని హతమార్చడం తదితర ఘటనలు ఆవేదన కలిగించాయన్నారు. విద్యార్థుల మానసిక స్థితిని మెరుగుపర్చుకుని, సమస్యలను ఎదుర్కొనే విధంగా దృఢ సంకల్పం ఏర్పరుచుకోవాలని విద్యార్థులకు సూచించారు.

అన్నదాతలకు అండగా..

- రైతు భరోసా – పీఎం కిసాన్ పథకాలతో రైతులకు చేయూత
- నేడు మూడో విడత సొమ్ము విడుదల
- నియోజకవర్గంలో 2,996 మంది రైతులకు రూ.1,11,26,000 లబ్ధి


బుట్టాయగూడెంలో రైతు పంట వివరాలను ఈ-కేవైసీ నమోదు చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం : సంక్షోభంలో కూరుకుపోయిన వ్యవసాయ రంగాన్ని గట్టెక్కించే బాధ్యతను తీసుకున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆర్థికంగా కుదేలైన అన్నదాతలకు భరోసా ఇచ్చే పథకాలను అమలు చేస్తూ ముందుకు సాగుతోంది. ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు వ్యవసాయ పెట్టుబడి సాయం అందిస్తామని ఇచ్చిన హామీని అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తూ అన్నదాతలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నారు. రైతు భరోసా పథకంలో ప్రతి ఏటా రైతుకు పెట్టుబడి సాయం కింద మొదట ప్రకటించిన రూ.12,500 సహాయానికి అదనంగా రూ.1000 పెంచి 'వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్' పథకం కింద ఏటా రూ.13,500 రైతుల ఖాతాల్లోకి నేరుగా జమ చేస్తూ రైతు వ్యవసాయానికి ఎటువంటి ఇబ్బంది కలుగకుండా వ్యవసాయ సమయంలో చేయూతను అందిస్తున్నారు. అయితే రబీ ఈ-క్రాప్, ఈ-కేవైసీ పూర్తి చేసుకున్న రైతులకు ఈ సొమ్ము జమ చేస్తున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

నియోజకవర్గంలో 2996 మంది రైతులకు లబ్ధి

వైఎస్సార్ రైతు భరోసా పథకంలో పంటల సాగుకు వీలుగా రైతులకు కొంత ఆర్థిక వెసులుబాటు దక్కింది. ప్రధానంగా చిన్న, సన్నకారు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల పేద రైతులకు భరోసా కొండంత సాయంగా ఆదుకుంటుంది. ఆయా వర్గాల్లో అర్హత కలిగిన ప్రతి రైతు కుటుంబానికి అండగా నిలుస్తోంది. ఇప్పటివరకూ రెండు విడతలుగా రైతు భరోసా, పీఎం కిసాన్ పథకంలో రైతుల బ్యాంక్ ఖాతాలో నేరుగా డబ్బు జమ చేసిన ప్రభుత్వం నేడు మళ్లీ మూడో విడత కూడా వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్ పథకంలో రైతుల ఖాతాలోకి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సొమ్ము జమ చేయనున్నారు. బుట్టాయగూడెం మండలంలో 800 మంది రైతులకు రూ. 30,25,000, పోలవరం మండలంలో 415 మంది రైతులకు రూ.13,99,000, జీలుగుమిల్లి మండలంలో 269 మంది రైతులకు రూ.11,27,500, టి.నర్సాపురం మండలంలో 518 మంది రైతులకు రూ. 23,59,500, కుక్కునూరు మండలంలో 131 మంది రైతులకు రూ.41,38,000, వేలేరుపాడు మండలంలో 416 మంది రైతులకు రూ.9,97,000, కొయ్యలగూడెం మండలంలో 384 మంది రైతులకు రూ. 17,80,000 చొప్పున లబ్ధి చేకూరుతున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

పోడు భూమిదారులకూ భరోసా

అటవీ భూముల్లో వ్యవసాయం చేసే రైతులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారు. గతంలో భూములకు పట్టాలు లేక గిరిజనులు అనేక అవస్థలు పడుతూ ఉండేవారు. అయితే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో పోడు భూములకు హక్కు కల్పిస్తూ గిరిజనులకు పట్టాలు ఇవ్వడం జరిగింది. అలాగే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా పోడు భూములకు పట్టాలు కల్పించారు. అంతేకాకుండా పోడు పట్టాలు కలిగిన ప్రతి ఒక్కరికీ రైతు భరోసా పథకం వర్తించే విధంగా కృషి చేశారు. దీనితో గిరిజన ప్రాంతంలో సుమారు 1,117 మంది రైతులకు సుమారు రూ. 22,34,000 వరకూ లబ్ధి చేకూరుతోంది. ఇచ్చిన మాట ప్రకారం రైతులకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రైతులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

భరోసా ఆదుకుంది



వ్యవసాయ పనుల ప్రారంభ సమయంలో గతంలో పెట్టుబడుల కోసం పక్కచూపులు చూసేవాళ్లం. అయితే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం వ్యవసాయానికి ముందే రైతు భరోసా పథకం ద్వారా అందిస్తున్న రూ.13,500 పెట్టుబడుల సహాయం మమ్మల్ని ఆపద కాలంలో ఆదుకుంటుంది. అనుకున్న ప్రకారమే ముందుగానే డబ్బులు చేతికి అందడంతో వ్యవసాయ పనులు చేయగలుగుతున్నాం.

– కలగర నాని, రైతు, కొమ్ముగూడెం

అప్పుల బాధ తప్పింది



గతంలో పంటలకు పెట్టుబడులు లేక అప్పుల కోసం తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పంటలు వేసేందుకు ముందే సహాయాన్ని అందిస్తున్నారు. నేరుగా మా ఖాతాలోకి పెట్టుబడి సాయం అందుతోంది. పెట్టుబడికి ఇబ్బంది లేకుండా వ్యవసాయం చేస్తున్నాం.

– మడకం చల్లమ్మ, గిరిజన మహిళా రైతు, ఇప్పలపాడు

రైతుల బ్యాంక్ ఖాతాలో నేరుగా సొమ్ములు జమ



రబీ ఈ-క్రాప్, ఈ-కేవైసీ పూర్తి చేసుకున్న రైతులకు నేరుగా నేడు రైతు భరోసా, పీఎం కిసాన్ పథకంలో సొమ్ములు జమ కానున్నాయి. ఈ కార్యక్రమంపై ప్రతి రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవగాహన కలిగించేందుకు సభలు నిర్వహించడం జరుగుతుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సందేశానంతరం సొమ్ములు జమ చేయడం జరుగుతుంది.

– పీజీ బుచ్చిబాబు, వ్యవసాయ సంచాలకులు, కేఆర్‌పురం

డయల్ యువర్ డీఎంకు నాలుగు ఫిర్యాదులు

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని ఆర్టీసీ డిపోలో సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించారు. అక్కంపేటకు చెందిన నాగేంద్రబాబు జంగారెడ్డిగూడెం నుండి రెడ్డిగణపవరం వయా అక్కంపేట మీదుగా ఉదయం, సాయంత్రం రెండు ట్రిప్పులు బస్సులు నడపవలసిందిగా కోరినట్లు డీఎం తెలిపారు. అలాగే పంగిడిగూడెంకు చెందిన ఎం.వరప్రసాద్ జంగారెడ్డిగూడెం నుంచి పేరంపేట, పంగిడిగూడెం, రాజవరం మీదుగా కొయ్యలగూడెం రూట్ నందు సర్వీసు నడపాలని కోరారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం సమయాలలో మూడు ట్రిప్పులు ఏర్పాటు చేయాలని సూచించారన్నారు. పట్టణానికి చెందిన కేవీ రామ్మోహనరావు దివ్యాంగులకు కేటాయించిన సీట్లలో వారిని కూర్చునేలా కండక్టర్లు సహకరించాలని కోరారన్నారు. లక్కవరానికి చెందిన జగదీష్ లక్కవరం మీదుగా కొయ్యలగూడెంనకు బస్సులు నడపాలని కోరినట్లు వివరించారు. పై సూచనలను పరిశీలించి సాధ్యమైన వాటిని త్వరలో అమలు చేస్తామని డీఎం పీవీవీ గంగాధరరావు తెలిపారు.

జగన్ పాలనలో మహిళలకు ప్రాధాన్యత

- గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- శ్రీవారి దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యురాలికి ఘన సత్కారం


వెంకటకొండ పద్మ, జ్యోతి శ్రీనివాస్ దంపతులను సత్కరిస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, తదితరులు

ద్వారకాతిరుమల : గతంలో ఎన్నడూలేని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అన్నింటా ప్రాధాన్యత ఇస్తున్నారని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కాపు నేతల ఆధ్వర్యంలో శ్రీవారి దేవస్థానం నూతన ట్రస్టుబోర్డు సభ్యురాలు పెద్దిరెడ్డి వెంకటకొండ పద్మ, జ్యోతిశ్రీనివాస్ దంపతులకు కాపు కల్యాణ మండపంలో సోమవారం అభినందన సభను నిర్వహించారు. అందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే తలారి పార్టీ నేతలు, కార్యకర్తలతో కలసి వెంకటకొండ పద్మ దంపతులకు దుశ్శాలువా కప్పి, గజ పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. అనంతరం మెమెంటోను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో హిందూ ఆలయాల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. అందులో భాగంగా ఆలయాలకు ట్రస్టుబోర్డులను ఏర్పాటు చేసి, మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. చినవెంకన్న దేవస్థానం చైర్మన్ ఎస్వీ సుధాకరరావుతో కలసి ద్వారకాతిరుమల గ్రామాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. గ్రామంలో సెంట్రల్ లైటింగ్, మంచినీటి ప్రధాన పైప్‌లైన్ మార్చేందుకు చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. కొండపై ఆహ్లాదభరితమైన ఒక పెద్ద పార్కును ఏర్పాటు చేసేందుకు రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్‌రామ్, తాను యోచిస్తున్నట్టు చెప్పారు. భక్తుల కాలినడక మార్గమైన దూబచర్ల–ద్వారకాతిరుమల రహదారిని ఈ వేసవిలో నిర్మిస్తామని, అలాగే ఆ రోడ్డుకు వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే ద్వారకాతిరుమల–భీమడోలు రహదారిని రూ.18 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసినట్టు చెప్పారు. అనంతరం ట్రస్టుబోర్డు సభ్యురాలు వెంకటకొండ పద్మ, జ్యోతి శ్రీనివాస్ దంపతులు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి దేవస్థానం నుంచి రావాల్సిన నిధులను ఎమ్మెల్యే తలారి, ఆలయ చైర్మన్ సుధాకరరావుల సహకారంతో తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, అంబటి గాంధీ, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, ఉక్కుర్తి వెంకట్రావు, బొండాడ సాత్యకిరావు, యిమ్మడి నాగు, యిమ్మడి పవన్‌కుమార్, ఏసుబాబు, చిలుకూరి నాగసుబ్రహ్మణ్యం తదితరులున్నారు.

ముస్లింల సంక్షేమానికి సీఎం జగన్ కృషి


లక్కవరంలో మసీద్‌ను సందర్శించిన వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కామిల్ జమ

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని లక్కవరం మసీద్‌ను సోమవారం వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కామిల్ జమ సందర్శించారు. మసీద్ కమిటీ సభ్యులు, స్థానికులతో ఆయన మాట్లాడి సమస్యలు, మసీద్‌కు వచ్చే ఆదాయ వనరులు అడిగి తెలుసుకున్నారు. మసీద్ ఆస్తుల మీద వచ్చే సంవత్సర ఆదాయానికి సంబంధించి వక్ఫ్‌బోర్డుకు ఫండ్ కట్టి రసీదు తీసుకోవాలని సూచించారు. పాత బకాయిలను వెంటనే చెల్లించాలని, తద్వారా ముస్లింలకు వక్ఫ్‌బోర్డు అభివృద్ధికి తోడ్పాటు అందించాలని మసీద్ కమిటీ సభ్యులకు కామిల్ జమ సూచించారు. మహానేత వైఎస్సార్ అడుగుజాడల్లో ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముస్లింలకు అన్ని విధాలా అండగా ఉంటున్నారన్నారు. ముస్లింలకు రిజర్వేషన్, ఆరోగ్యశ్రీ, అమ్మ ఒడి, ఇళ్లస్థలాలు, వసతి దీవెన, వైఎస్సార్ షాదీతోఫా ప్రవేశపెట్టారన్నారు. పేద ముస్లిం యువతీ, యువకుల వివాహానికి లక్ష రూపాయలను ప్రభుత్వం ఇస్తోందన్నారు. హజ్ యాత్రకు వెళ్లే ముస్లింలకు సబ్సిడీ కోట పెంచి హజ్ యాత్రకు పంపుతున్నట్లు వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కామిల్ జమ అన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కబ్జాకు గురైన జిల్లాకు చెందిన వక్ఫ్‌బోర్డు భూములను తిరిగి వక్ఫ్‌బోర్డుకు చెందేలా కృషి చేస్తామన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో వక్ఫ్‌బోర్డు భూములు ఎక్కడా కబ్జాకు గురికాకుండా చర్యలు చేబడుతున్నామన్నారు. వక్ఫ్‌బోర్డు జిల్లా డైరెక్టర్ షేక్ మొహమ్మద్ జహీర్, పఠాన్ అస్‌గర్ ఆలీ, షేక్ ఇమామ్, రహమతుల్లా, జనోత్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యం


ఎమ్మెల్యే బాలరాజుకు కృతజ్ఞతలు తెలుపుతున్న నారాయణ, తదితరులు

బుట్టాయగూడెం : రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుని పార్టీ గెలుపునకు తనవంతు కృషి చేస్తానని ఆ పార్టీ ఏలూరు జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు కొవ్వాసి నారాయణ చెప్పారు. సోమవారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసి 2019 ఎన్నికల్లో పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేశానని చెప్పారు. తనపై ఎంతో నమ్మకంతో మళ్లీ ఏలూరు జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా నియమించినందుకు పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి ఆళ్ల నాని, ఎమ్మెల్యే తెల్లం బాలరాజును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు చెప్పినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనుల అభివృద్ధికి, సంక్షేమానికి చేసిన కృషిని ప్రతి ఆదివాసీ గిరిజన గ్రామాల్లో గిరిజనులకు అవగాహన కలిగించేందుకు కృషి చేస్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో పోలవరం నియోజకవర్గ గెలుపును సీఎం వైఎస్ జగన్‌కు గిఫ్ట్‌గా ఇచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ బుట్టాయగూడెం మండలం కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చిక్కాల దుర్గాప్రసాద్, కేఆర్‌పురం సర్పంచ్ ఉయికే బొజ్జి, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

టి.నరసాపురం : భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు ఇవ్వడంతో ఎస్సై కె.సతీష్‌కుమార్ కేసు నమోదు చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కొల్లివారిగూడెంకు చెందిన నల్లగొల్ల సాంబయ్య, అతని భార్య ఈనెల 17న యధావిధిగా కూలి పనులకు వెళ్లి, తిరిగి వచ్చి ఇంట్లో నిద్రించారు. రాత్రి 12 గంటల సమయంలో భర్త మెలకువ వచ్చి చూసే సరికి భార్య కనిపించలేదు. బంధువుల ఇంటి వద్ద, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో సాంబయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని హితవు


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ కేవీ సత్యనారాయణ

జంగారెడ్డిగూడెం : యువత మాదక ద్రవ్యాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని జంగారెడ్డిగూడెం డీఎస్పీ కేవీ సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాల వాడకం, కలిగే దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ కేవీ సత్యనారాయణ మాట్లాడుతూ చెడు మార్గాలలో పయనించి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని యువతకు హితవు పలికారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాలు కలిగి ఉన్నా, వినియోగించినా, విక్రయించినా, రవాణా చేసినా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా మార్చాలనే ఉద్దేశంతో పోలీస్, ఎస్‌ఈబీ అధికారులు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. మాదక ద్రవ్యాల సమాచారాన్ని ఏలూరు పోలీస్ కంట్రోల్ రూమ్ ఫోన్ 83329 59175కు, డయల్ 100, జిల్లా వాట్సయాప్ నంబర్ 95503 51100కు మెసేజ్ చేయవచ్చన్నారు. లేదా ఎస్ఈబీ టోల్ ఫ్రీ నెంబర్ 14500కు కాల్ చేసి సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సీఐ బాల సురేష్‌బాబు, ట్రాఫిక్ ఎస్సై రామకృష్ణ, శంకరి కాలేజీ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, కాలేజీ విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ నిర్మాణానికి రూ.15.98 లక్షల మంజూరు


కొండరెడ్డి గిరిజనులతో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

బుట్టాయగూడెం : మండలంలోని మారుమూల అటవీప్రాంతంలో బాహ్యప్రపంచానికి దూరంగా ఉన్న తానిగూడెం గ్రామంలోని గిరిజనుల దాహార్తిని తీర్చేవిధంగా సుమారు రూ. 15,98,000 నిధులు మంచినీటి వాటర్ ట్యాంక్ నిర్మాణానికి మంజూరయ్యాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మురళీకృష్ణ తెలిపారు. ఆయన సోమవారం ఆ గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులతో కలిసి వాటర్ ట్యాంక్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. గ్రామంలో ఉన్న చేతిపంపు మరమ్మతులను పూర్తిచేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గిరిజన గ్రామాల్లో రానున్న వేసవిలో మంచినీటి ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారుల ఆదేశాలతో గిరిజన ప్రాంతంలోని ప్రతి గ్రామాన్ని సందర్శించి గ్రామంలో మంచినీటి యెద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తానిగూడెంలో త్వరలోనే వాటర్ ట్యాంక్ నిర్మాణం పనులు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొవ్వాసి గోవిందరాజు, సర్పంచ్ కోర్సా గంగరాజు, మాజీ సర్పంచ్ గురుగుంట్ల గంగిరెడ్డి, న్యూడెమోక్రసీ నాయకులు కారం రాఘవ, సామాజిక కార్యకర్త పెద్దిరెడ్డి మూర్తితోపాటు గిరిజన పెద్దలు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ఫీల్డ్ ట్రిప్

జంగారెడ్డిగూడెం : స్థానిక సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సోమవారం ఫీల్డ్ ట్రిప్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్.ఎన్.ప్రసాద్ బాబు పర్యవేక్షణలో కామర్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఫీల్డ్ ట్రిప్ నిర్వహించారు. దీనిలో భాగంగా కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్న బీకామ్ విద్యార్థులు పవన్ హోండా మోటార్స్‌ను సందర్శించారు. బ్రాంచ్ మేనేజర్ వీరుళ్ళు ఇతర టీమ్ మెంబర్స్ మార్కెటింగ్ విధానాలను బ్రోచర్ల సహాయంతో వివరించారు. కళాశాల కామర్స్ డిపార్ట్‌మెంట్ ఇన్‌ఛార్జ్ డాక్టర్.కె.ఉత్తమ్ సాగర్, అధ్యాపకులు సీహెచ్ రమాదేవి, కేవీవీ శిరీష తదితరులు పాల్గొన్నారు.

మార్చి 10లోగా రైతు విభాగం కమిటీలు


ఆళ్ల నానిని కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న రైతు విభాగం జిల్లా అధ్యక్షులు వాసిరెడ్డి మధు

టి.నరసాపురం : జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ రైతు విభాగం కమిటీల నియామకాన్ని మార్చి 10వ తేదీ నాటికల్లా పూర్తి చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని సూచించారని, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు,, కె.జగ్గవరం సహకార సంఘం చైర్మన్ వాసిరెడ్డి మధు తెలిపారు. రైతు సంఘం అధ్యక్షునిగా నియమితులైన సందర్భంగా మధు సోమవారం ఏలూరులో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నానిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ అనుబంధ సంఘాల కమిటీల నియామకాలను త్వరితగతిన పూర్తి చేయాలని నాని సూచించారన్నారు. ఆ మేరకు కృషి చేస్తామని, పార్టీ అభివృద్ధికి తోడ్పడతామని మధు తెలిపారు. అనంతరం చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజాను కలిశారు. ఎస్టీ విభాగం అధ్యక్షుడు కొవ్వాసి నారాయణ, సోషల్ మీడియా కన్వీనర్ చిక్కాల దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.

దోషులను శిక్షించాలని.. కొవ్వొత్తుల ర్యాలీ


కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

చింతలపూడి : మెడికల్ విద్యార్థిని ప్రీతి మృతిపై న్యాయ విచారణ జరిపించాలని లంబాడీ హక్కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో సోమవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ధారావతు కీమ్యా నాయక్, ఎంపీపీ డా రాంబాబు నాయక్ మాట్లాడుతూ ప్రీతి మృతికి కారణమైన నిందితులకు ఉరి శిక్ష వేయాలని డిమాండ్ చేశారు. ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. సీనియర్ల ర్యాగింగ్ కారణంగా ఎంతో భవిష్యత్తు ఉన్న ప్రీతి మృతి చెందడం బాధాకరమన్నారు. తెలంగాణ ప్రభుత్వం దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లంబాడీ హక్కుల సంక్షేమ సంఘం నాయకులు రాజాబాబు తదితరులు పాల్గొన్నారు.

కాలనీలో మౌలిక వసతులు మెరుగుపరచాలని వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

చింతలపూడి : స్థానిక వైఎస్సార్ కాలనీలో మౌలిక వసతులు మెరుగుపరచాలని కోరుతూ కాలనీవాసులు సోమవారం తహసీల్దార్ కృష్ణజ్యోతికి వినతి పత్రం అందచేశారు. 2006లో అప్పటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సుమారు 200 కుటుంబాలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు కూడా మంజూరు చేశారని కాలనీవాసులు తెలిపారు. ఇంతవరకు రోడ్లు, డ్రెయిన్లు, వీధిలైట్లు నిర్మించలేదని వాపోయారు. కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని, రహదారిని సర్వే జరిపించి ఆక్రమణలు తొలగించాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు.

రహదారిని అభివృద్ధి చేయండి


ఆందోళన నిర్వహిస్తున్న గ్రామస్తులు

చింతలపూడి : యర్రగుంటపల్లి పంచాయతీ ఊటసముద్రం గ్రామం నుంచి మెట్టిమెల్లిగూడెం వెళ్లే రహదారిని అభివృద్ధి చేయాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. గ్రామస్తులు ఎం సర్వేశ్వరరావు, తిరుపతిరావు మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా ఉండడంతో విద్యార్థులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.